క్లుప్తంగా

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి వేడుకలు

కోవెలకుంట్ల: స్థానిక బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న, పార్టీ మండల అధ్యక్షుడు రవితేజరెడ్డి ఆధ్వర్యంలో దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దయాళ్ జనసంఘం పార్టీని స్థాపించి దేశవ్యాప్తిగా పార్టీని బలోపేతం చేశాడని సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పపోగు వెంకటసుబ్బయ్య, సీతారామయ్య, షేక్‌చాందిని, కుళాయి, దస్తగిరి, రంగన్న పాల్గొన్నారు.

కోవెలకుంట్ల సీఐగా రామాంజులు



కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.రామాంజులును నియమిస్తూ జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న నారాయణరెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. కర్నూలు ఇంటెలిజెన్స్ సీఐగా పనిచేస్తున్న రామాంజులును ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మద్యం దుకాణాలు తనిఖీ

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం గ్రామాల్లోని ప్రభుత్వ మద్య దుకాణాలను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. చిత్తూర్ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్, ఎస్ఐ రామకృష్ణశాస్త్రి సామాజిక తనిఖీలో భాగంగా మద్యం దుకాణంలో రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ లక్ష్మణ్ హెచ్చరించారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు నాగరాజు, కుమార్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

పక్షోత్సవాలను విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న పక్షోత్సవాలను విజయవంతం చేయాలని మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ గోపినాథ్ సూచించారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఐదు గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం పంచాయతీలో శ్రమదానం, 30న ర్యాలీ, అక్టోబర్ 1న శ్రమదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కనీస వేతనం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మధు శేఖర్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్ల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అరెస్టు చేయడం తగదన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని సోమవారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రోజా, అంజనమ్మ, లక్ష్మి, రేణుక, మహాలక్ష్మి, సాలమ్మ, హేమలత పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత

బేతంచెర్ల: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, ఆర్ కొత్తపల్లె ఎంపీటీసీ సభ్యుడు మునేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంగన్న, వైద్యురాలు శాంతి ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి మంజూరైన బీపీ మిషన్లను ఏఎన్ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకట రంగనాయకులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్త దానం



రక్తం అందిస్తున్న దాత

డోన్ టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో గర్భిణికి రక్తం అవసరం కావడంతో బంధువులు ద్రోణాచలం సేవా సమితిని ఆశ్రయించారు. స్పందించిన ఆటో మధు సోమవారం హాస్పిటల్‌కు వెళ్లి ఓ పాజిటివ్ రక్తం దానం చేశారు. దాత మధుకు గర్భిణి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

మూగజీవాలకూ ఆరోగ్య రక్ష!

- సత్ఫలితాలిస్తున్న పశువ్యాధి నిర్ధారణ కేంద్రం
- నియోజకవర్గంలో 2,800 రక్త పరీక్షలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పశుయజమానులు



బనగానపల్లెలోని డాక్టర్ వైఎస్సార్ నియోజకవర్గస్థాయి పశువ్యాధి నిర్ధారణ కేంద్రం



రక్త పరీక్ష చేస్తున్న దృశ్యం

బనగానపల్లె: నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం మూగజీవాలకు రక్షణగా నిలుస్తోంది. పెంచుకుంటున్న పశువులు అనారోగ్యానికి గురైతే వాటి యజమానులు పడే ఆందోళన అంతా ఇంతా కాదు. ఇదే విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం మూగ జీవాల ప్రాణాలకు కూడా భద్రత ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటు చేసి వాటి ద్వారా వ్యాధులను కనుగొని వైద్యం చేస్తూ ప్రాణాలకు భరోసా ఇస్తోంది. మరో వైపు సంచార పశు వైద్యశాల(అంబులెన్స్) ద్వారా గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యసేవలు అందిస్తున్నారు. పశువైద్య సేవలు అవసరం ఉన్నవారు టోల్‌ఫ్రీ నంబరు 1962కు ఫోన్ చేస్తే సంచార పశువైద్య అంబులెన్స్ ద్వారా పశువైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్తున్నారు. రోగతీవ్రతను బట్టి అంబులెన్స్ ద్వారా పశువులను సమీపంలోని పశువైద్యశాలలకు తీసుకెళ్లి వైద్యం చేస్తున్నారు. పశువైద్య సేవల పట్ల వాటి యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల వివరాలు	
సంవత్సరం	పరీక్షల సంఖ్య
2021-22	460
2022-23	1660
2023-24	480

జబ్బు తెలుసుకొని వైద్యం..

పశువుల్లో వచ్చే జబ్బులకు గతంలో వ్యాధి లక్షణాలను బట్టి వైద్య సౌకర్యం కల్పించేవారు. ఒక్కోసారి జబ్బు కచ్చితంగా తెలియకపోవడంతో చికిత్స ఫలించేదికాదు. ఫలితంగా పశుమరణాలు సంభవించిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పశుమరణాలు అరికట్టేందుకు నడుం బిగించింది. అందులోభాగంగా 2021 జూలై 9న డాక్టర్ వైఎస్సార్ నియోజకవర్గస్థాయి పశువ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేశారు. పశువుల పేడా, రక్తనమూనాలు సేకరించి పరీక్షించి వ్యాధిని తెలుసుకుంటున్నారు. బనగానపల్లె కేంద్రంగా ప్రయోగశాలను ప్రారంభించినప్పటి నుంచి ఇంత వరకు 2,800 పశువుల నమూనాలకు పరీక్షలు చేసి వ్యాధిని గుర్తించారు. పశువ్యాధి నిర్ధారణ అవుతున్నందున రైతులు తమ పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా పశువులకు వైద్య సౌకర్యం కల్పిస్తున్నందున పశు మరణాలు లేవని అవసరమైన వైద్య సౌకర్యం లభిస్తున్నట్లు పశుయజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ నియోజకవర్గస్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను పశుయజమానులు సద్వినియోగపరచుకోవాలి.పశువులకు రోగాలు సంభవించినప్పుడు సంచార పశువైద్యశాల అంబులెన్స్‌కు గానీ సమీపంలోని పశువైద్యశాల వైద్యులకు గానీ పశు యజమానులు సమాచారం అందించాలి. పశువులకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించుకొని వైద్య సౌకర్యం పొందాలి.ఈ విధమైన పద్ధతులు పాటిస్తే పశు మరణాలు ఉండవు.– డాక్టర్ జి.రవిబాబు, అసిస్టెంటెంట్ డైరెక్టర్ జిల్లా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

వాహనాల తనిఖీ

బేతంచెర్ల: ప్రైవేటు వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వెలితే కేసుల నమోదుతోపాటు జరిమానా విధిస్తామని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సరిగాలేని, అధిక లోడులో వెళ్తున్న, ట్యాక్స్‌లు చెల్లించని 9 వాహనాలపై కేసులు నమోదు చేసి, రూ.3,14,370 జరిమానా విధించినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



సుధీర్‌గౌడ్(ఫైల్)

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటకు చెందిన టీఈ సుదర్శన్ గౌడ్ (29) అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామిరెడ్డి తెలిపిన వివరాలు.. కొండపేటకు చెందిన టీఈ గుండాలయ్యగౌడ్, పుష్పవతి దంపతుల కుమారుడు సుధీర్‌గౌడ్‌కు రెండు నెలల క్రితమే వివాహమైంది. భార్య కొన్ని రోజుల క్రితం పుట్టినింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఈ నెల 22న ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పట్టణంతో పాటు బంధువులు, స్నేహితులు, ఇతర గ్రామాల్లో వెతికిన ఆచూకీ లేకపోవడంతో తల్లి పుష్పావతి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బుగ్గన చొరవతోనే డోన్‌కు కేంద్రీయ విద్యాలయం



మాట్లాడుతున్న ఎంపీపీ, మునిసిపల్ చైర్మన్

- డోన్ ఎంపీపీ, మునిసిపల్ చైర్మన్

డోన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతోనే కేంద్ర ప్రభుత్వం డోన్‌కు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసిందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంత్రి స్వగృహంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్‌తో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఇటీవల 27 కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసిందన్నారు. అందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి వల్ల ఏపీకి 8 కేటాయించారన్నారు. డోన్‌తో పాటు అనకాపల్లి, చిత్తూరు జిల్లా మదనపల్లె, గుంటూరు జిల్లా మాచెర్ల, మదనపల్లె సమీపంలోని వలసలపల్లి, మాచెర్ల సమీపంలోని పాలసముద్రం, కృష్ణా జిల్లా నందిగామ, గుంటూరు జిల్లా రొంపిచెర్ల, వేలూరు జిల్లా నూజివీడులలో కేంద్రీయ విద్యాలయాలు వచ్చే ఏడాది నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ హయాంలో మోడల్, ఏపీ గురుకులం, అంబేడ్కర్ గురుకుల స్కూళ్లు మంజూరు కాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బీసీ, ఎస్సీ, వెల్ఫేర్ కళాశాలలు, వసతి గృహాలు, ఐటీఐ వసతిగృహం, వెటర్నరీ కళాశాల, గొర్రెల పెంపకం కేంద్రం, పాలిటెక్నిక్, ఉర్దూ పాఠశాలలు, వంద పడకల ప్రభుత్వాసుపత్రికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం పేరంటాలమ్మ గుడి వద్ద 10 ఎకరాల స్థలంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభించేందుకు ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. విద్యతో పాటు ఉపాధి రంగాల్లో డోన్‌ను అగ్రగామిగా ఉంచేందుకు మంత్రి బుగ్గన కృషి చేస్తున్నారన్నారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డికి కనిపించడం లేదన్నారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని అభివృద్ధి ఎక్కడ అంటూ ప్రశ్నించే సుబ్బారెడ్డి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరినా పత్తా లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టుప్రసాద్, బీసీ సంఘం కార్యదర్శి భాస్కర్‌నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షులు కురుకుంద హరి, నాయకులు ఆర్ఈ రాజవర్దన్, మహేశ్వరరెడ్డి, చిరంజీవి, ప్రతాప్‌రెడ్డి, పాతపేట రఫి, నాగిరెడ్డి, మిట్టా రవికుమార్, కుమ్మరి రాజు, వెంకటస్వామి, మల్లికార్జునగౌడ్, సుంకన్న, వెంకట్రాముడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘ఆరోగ్య సురక్ష సర్వే’



ప్యాపిలి: ఎర్రగుంట్లపల్లిలో సర్వేలో భాగంగా బీపీ పరీక్షిస్తున్న ఏఎన్ఎం



బేతంచెర్ల పట్టణంలో వృద్ధురాలికి టోకెన్ అందజేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ



ప్యాపిలి: పెద్దపొదిళ్లలో షుగర్ పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డోన్/టౌన్/ప్యాపిలి: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నియోజకవర్గ వ్యాప్తంగా చురుగ్గా సాగుతోంది. ఏఎన్ఎంలు,ఆశావర్కర్లతో ఇంటింటికి తిరిగి వివిధ వ్యా ధులతో బాధ పడుతున్న వారిని గుర్తించి నమోదు చేసుకుంటున్నారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 30వ తేదీవరకు నిర్వహించనున్న హెల్త్ క్యాంపులలో వైద్యం చేయించుకునేందుకు టోకెన్లు ఇస్తున్నారు.అలాగే డాక్ట ర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం సేవలను ఎలా వినియోగించుకోవాలో తెలియజేస్తున్నారు. సోమవారం డోన్ పట్టణంలోని 14వ వార్డు,మాదన్న నగర్, ప్యాపి లి మండలంలోని 11 గ్రామాల్లో సర్వే నిర్వహించారు.

బనగానపల్లె నియోజకవర్గంలో..

బనగానపల్లె/సంజామల/కొలిమిగుండ్ల: బనగానపల్లె నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కొనసాగుతోంది. సోమవారం టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భానుముక్కల, సంజామల మండలం ముక్కమల్ల, కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వ్యాధుల బారిన పడిన వారి వివరాలు నమోదు చేసుకున్నారు.



భానుముక్కలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



ముక్కమల్ల గ్రామంలో వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



బెలుంలో పక్షవాతంతో మంచానికి పరిమితమైన గురవయ్యకు పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం మాధవీ

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరాం, మండల అధక్షులు రామాంజనేయులు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చినా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రయోజనాలు కల్పించడం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, ఉపాధ్యక్షులు పెద్ద ఎల్లయ్య, నాయకులు గోవిందు, దేవదానం, ఏసు, ఆవులయ్య, నాగరాజు, రామాంజనమ్మ,లక్ష్మీస్వరి, వెంకటలక్ష్మి, మాదమ్మ ఉన్నారు.

పశుగ్రాసం సబ్సిడీ చెక్కుల పంపిణీ



పాడి రైతులకు సబ్సిడీ చెక్కులను పంపిణీ చేస్తున్న డెయిరీ మేనేజర్ మధుసూదన్‌బాబు

బనగానపల్లె రూరల్: స్థానిక విజయ డెయిరీ యూనిట్ మేనేజర్ మధుసూదన్‌బాబు యనకండ్ల గ్రామంలో ఐదుగురు పాడి రైతులకు పశుగ్రాసం సబ్సిడీ మొత్తం రూ.12,500ల చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మధుసూదన్ బాబు మాట్లాడుతూ సంస్థ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే యూనిట్ పరిధిలో ఉన్న శివవరం గ్రామానికి చెందిన ఐదుగురు రైతులకు రూ.15 వేల సబ్సిడీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజెంట్లు ఎన్‌సీ రోషిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవతా విగ్రహం లభ్యం

- రవ్వలకొండ పై దేవత రూపం కలిగిన రాయి లభ్యం



లభ్యమైన అమ్మవారి విగ్రహం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న బాలాంజనేయస్వామి దేవస్థానం ఎదురుగా ఖాళీ స్థలంలో దేవతా విగ్రహం సోమవారం లభ్యమైంది. రవ్వలకొండపై ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహం విద్యార్థుల సౌకర్యార్థం ఇటీవల జేసీబీతో పెద్దపెద్ద బండరాళ్లను తొలగించారు. ఇదే స్థలంలో విద్యార్థులు క్రికెట్ ఆడేందుకు శుభ్రం చేసుకుంటూ ఉండగా మూడు అడుగుల అమ్మ వారి రూపం విగ్రహం బయటపడిందని బీసీ వసతి గృహం వార్డెన్ నాగేంద్ర తెలిపారు. అమ్మ వారి ఒక చేతిలో తామర పూలు, మరో చేతిలో డమరుకం ఉంది. పూర్వం ఇక్కడ గ్రామం ఉండేదని, గ్రామానికి సంబంధించిన గ్రామ దేవత అయి ఉండవచ్చునన్న అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

ఘనంగా శివపార్వతులకు పల్లకీ సేవ



శివపార్వతులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పల్లకీ సేవా కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముగిసిన షటిల్ టోర్నీ



విజేతలకు షీల్డులను అందజేస్తున్న ఎంపీపీ, మునిసిపల్ చైర్మన్‌లు

డోన్: స్థానిక బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన షటిల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. విజేతలకు ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ ఈసీ సభ్యులు నాగభూషణంరెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, కమలాపురం సర్పంచ్ అర్జున్‌రెడ్డి, క్రీడా నిర్వాహకులు వెంకట్రావ్, జహీర్, మునిసిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: జలదుర్గం సబ్‌స్టేషన్‌లో 33, 11 కేవీ మరమ్మతులు చేపడుతున్న కారణంగా పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం, గార్లదిన్నె, మాధవరం, ఊటకొండ, గోపాలనగరం, రామరత్నగిరి తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ నిర్వాహకుడి దుర్మరణం



మదన్‌మోహన్‌రెడ్డి(ఫైల్)

బనగానపల్లెరూరల్: ఇల్లూరుకొత్తపేట గ్రామ గ్రంథాలయ నిర్వాహకుడు వై మదన్‌మోహన్‌రెడ్డి(50) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మదన్‌మోహన్ రెడ్డి బనగానపల్లెలో పని ముగించుకొని రాత్రి స్వగ్రామం ఇల్లూరు కొత్తపేటకు బైక్‌పై బయలుదేరాడు. గ్రామ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద కోవెలకుంట్ల వైపు నుంచి అతివేగంగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన మదన్‌మోహన్‌రెడ్డిని 108లో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగానే మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటసుబ్బమ్మ, కుమారుడు కూతురు ఉన్నా రు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్యాపిలి: అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు సీరజ, లావణ్య, నాగమణి, సరస్వతి తదితరులు కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం వారు డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ఆప్‌ను తొలగించాలన్నారు. రిటైర్మెంట్ బెన్‌ఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, అనంతమ్మ, గౌరి, చాముండేశ్వరి పాల్గొన్నారు.

రసాయనాల వాడకం తగ్గించండి



మాట్లాడుతున్న ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి

డోన్ రూరల్: పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, యాగంటిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఎర్రగుంట్ల సమీపంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫితో కలిసి పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన, క్రిమిసంహారక మందులు వాడటం వల్ల నేల సారం తగ్గుతుందన్నారు. మందులు లేకుండా కొర్ర పండించిన వారికి ప్రభుత్వం నుంచి స్కోప్ సర్టిఫికెట్ ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధాకర్, రమణయ్య పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



మిరప పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బేతంచెర్ల: రైతులు పంటల సాగుకు సకాలంలో స్పందించి సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని బనగానపల్లె కేవీకే శాస్త్రవేత్తలు బాలరాజు, సుధాకర్, రమణయ్య తెలిపారు. సోమవారం హెచ్ కొట్టాల సమీపంలో మిరప, మినుము, సోయాబీన్, సద్ద, కంది పంటలను పరిశీలించారు. పంటలసాగు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగుల నివారణ వాడాల్సిన మందులను సూచించారు. శనగ పంట వేసుకునే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

28న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడు గ్రామంలో ఈ నెల 28న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని పార్టీ మండల ఇన్‌చార్జ్ బీవీ నాగార్జున రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.38 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్, రూ.5 లక్షలతో నిర్మించిన డ్రెయినేజీ పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలో జరుగుతున్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ ఎక్స్‌టెన్షన్ సెంటర్ పనులను డీజీఎం ప్రసాద్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ విశాఖ పట్టణం కమిటీ సభ్యులు, పరిశ్రమల అధికారులు సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై చర్చించారు. పనులు పూర్తికాగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌లో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మంత్రి ఓఎస్డీ ప్రతాప్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ పాల్గొన్నారు.